ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

5★★★

గురువారం 25 జనవరి 2024

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ - 8లో..

వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని
సీఎం దృష్టికి తీసుకెళ్తాం - 8లో..



● జాతీయ ఓటరు దినోత్సవం

భారత రాజ్యాంగం 15వ భాగంలో 324వ అధికరణం ఎన్నికల సంఘం నిర్మాణం, అధికారాలు, విధులను ప్రస్తావించింది. భారత ఎన్నికల సంఘం జనవరి 25, 1950లో ఏర్పడింది. అందుకే 2011 నుంచి జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఎన్నికల సంఘం స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన సంస్థ. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకు పార్లమెంట్ ఉభయ సభలకు రాష్ట్ర శాసన సభలకు, విధాన పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహించడం ప్రధాన విధులు. ఈ సంఘం ఉప ఎన్నికలు, మధ్యంతర ఎన్నికులు కూడా నిర్వహిస్తుంది. సంఘానికి ప్రస్తుతం ఒక ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు ఉన్నారు. ఈ కమిషనర్లను కేంద్ర మంత్రి మండలి సూచనలు అనుసరించి రాష్ట్రపతి నియమిస్తారు.

ఓటరు జాబితాకు కసరత్తు

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితా వెల్లడి
- సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో 4,68,064 మంది ఓటర్లు
- ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితా
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

లోక్‌సభ ఎన్నికలకు అధికార యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా అధికారులు లోక్‌సభ ఎన్నికలకు ఓటరు జాబితా సిద్ధం చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితా సవరణలో భాగంగా డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌ను అధికారులు వెల్లడించారు. అభ్యంతరాలు, ఓటరు నమోదు, చేర్పులు, మార్పులపై ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక శిబిరాలను సైతం నిర్వహించారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను వెల్లడించనున్నారు. ఏమైనా అభ్యంరతాలు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం ఉంది. ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు.

● ఇంటిల్లిపాది ఓట్లు ఒకే చోట

ఎన్నికల సమయాల్లో పోలింగ్ కేంద్రాల సర్దుబాటు క్రమంలో కుటుంబాల సభ్యుల ఓట్లు, పోలింగ్ బూత్‌లు మారిపోతున్నాయి. ఈసారి ఇంటిల్లి పాది ఓట్లు ఒకే చోట ఉండే విధంగా కసరత్తు చేశారు. ఇప్పటికే ఆధార్ అనుసంధానంతో డబుల్ ఓట్లను తొలగించారు. పకడ్బందీగా ఓటరు జాబితాను తయారు చేస్తున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్లకు మించి ఉండకుండా పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నారు. అన్ని ప్రక్రియలను ఏప్రిల్ 16లోగా పూర్తి చేయాలనే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఉండడంతో అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. పోలింగ్ కేంద్రాలతోపాటు తుది జాబితాను వెల్లడించే విధంగా ఏర్పాట్లు చేసుకున్నారు.

● ఓటు వజ్రాయుధం

ప్రజాస్వామ్య భారతదేశంలో ఓటు వజ్రాయుధం వంటిది. ప్రధాని నుంచి పల్లె పంచాయతీ సభ్యుడి వరకు ఓటు ద్వారానే ప్రజామోదం పొందాలి. సామాన్యుడికి సైతం ఓటుతోనే రాజకీయాలు, పార్టీల భవిష్యత్‌ను మార్చివేసే సత్తా ఉంటుంది. ఎన్నికలు రాగానే ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నేతలందరూ ఓటరు దేవోభవ అంటూ వేడుకుంటారు. రాజ్యాంగం ప్రతీ ఒక్కరికి కల్పించిన హక్కు ఓటుహక్కు. ఓటుహక్కు పొందడానికి ఎన్నికల కమిషన్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది.

సిరిసిల్ల, వేములవాడ సెగ్మెంట్లలో ఓటర్లు



ప్రత్యేక శిబిరాన్ని పరిశీలిస్తున్న నోడల్ అధికారి శ్రీదేవసేన (ఫైల్)

కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ప్రకారం 4,68,064 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 2,26,973 మంది. మహిళలు 2,40,895 మంది జెండర్ 37 మంది, సర్వీస్ ఓటర్లలో 153 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉన్నారు. ఇందులో వేమువాడ సెగ్మెంట్‌లో 2,24,071మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,07,725 మంది. మహిళలు 1,16,263 మంది జెండర్ 30మంది, సర్వీస్ ఓటర్లలో 50 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,43,993 మంది ఓటర్లు ఉం డగా పురుషులు 1,19,248 మంది. మహిళలు 1,24, 632 మంది జెండర్ 07 మంది, సర్వీస్ ఓటర్ల లో 103 మంది పురుషులు, ముగ్గురు మహిళలు ఉన్నారు.

సామాజిక బాధ్యతగా గుర్తించాలి

- డాక్టర్ కందేపీ రాణీప్రసాద్, బాలసాహితీ వేత్త



ఓటుహక్కు పొందడం, ఓటు వేయడాన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ఓటుహక్కు నమోదు కో సం విద్యావంతులు ప్రజల్లో అవగాహన పెంచడానికి కృషి చేయాలి. ఓటు హక్కు కోసం నిర్బంధ చట్టం తేవాలి.

ఓటు మన బాధ్యత

- మాణిక్యరావు మానీష్, సాఫ్ట్‌వేర్



ఓటు వేయడం మన బాధ్యతగా గుర్తించాలి. ఓటుకు ఎంతో విలువ ఉంది. మన భవిష్యత్‌ను తీర్చిదిద్దే ప్రజా ప్రతినిధులను ఎన్నుకునే వీలు ఉంటుంది. ఓటు హక్కును యువత వినియోగించుకోవాలి.

ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు కావాలి

- బుస్స పవన్, వ్యాపారి



ఓటు హక్కు వినియోగంతోనే ప్రజాస్వామ్యంలో మార్పులు సాధ్యమవుతాయి. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి. ఓటరు నమోదు కోసం ఎన్నికల కమిషన్ అవకాశాలు కల్పిస్తోంది.

● రాష్ట్రపతి నుంచి సామాన్యుడి వరకు

దేశంలో రాష్ట్రపతి నుంచి గ్రామ పంచాయతీ వార్డు సభ్యుడి వరకు, అత్యున్నత అధికారి నుంచి అటెండర్ వరకు, ధనిక, పేద తేడా లేకుండా అందరికీ ఒకే విధమైన గుర్తింపు కార్డు ఓటరు కార్డు మాత్రమే. భారత ఎన్నికల సంఘం జారీ చేసే గుర్తింపు కార్డుతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

రాజన్న హుండీ ఆదాయం రూ.కోటి 46 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడ, జనవరి 24 : జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానం ఖజానాకు హుండీ ద్వారా కోటి 46 లక్షల రూపాయలకుపైగా ఆదాయం సమకూరింది. ఏడు రోజుల వ్యవధిలో భక్తులు స్వామివారి హుండీల్లో సమర్పించిన కానుకలను ఆలయ ఓపెన్ స్లాబ్ ప్రాంగణంలో బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా కోటి 46 లక్షల, 79 వేల, 830 రూపాయల నగదు, 54 గ్రాముల, 150 మిల్లి గ్రాముల బంగారం, 9 కిలోల 100 గ్రాముల వెండి లభించినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణ ప్రసాద్ తెలిపారు. ఆలయ ఉద్యోగులు, భ్రమరాంబిక సేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

సైబర్ ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల క్రైం, జనవరి 24: సైబర్ నేరాల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, కేసులు నమోదు చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ వారియర్స్‌కు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరానికి గురైన సమయంలో టోల్ ఫ్రీ నంబరుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రస్తుతం టెక్నాలజీ వినియోగం పెరుగుతున్న కొద్దీ అదే స్థాయిలో సైబర్ నేరగాళ్ల కొత్త మార్గాల్లో విజృంభిస్తున్నారని, ప్రజల సొమ్మును దోచేస్తున్నారని అన్నారు. సైబర్ నేరాలను నియంత్రించాలంటే ముందుగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మోసపోయిన బాధితులు తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 1930కి సమాచారం అందించే విధంగా వివరించాలన్నారు. జిల్లా సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎస్సై జునైద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అదనపు ఎస్పీ చంద్రయ్య, సైబర్ సీఐ శ్రీధర్ పాల్గొన్నారు.

ట్రెసా డైరీ ఆవిష్కరణ



డైరీలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 24 : సిరిసిల్ల కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ట్రెసా-2024 సంవత్సర డైరీని ఆవిష్కరించారు. ముఖ్య ప్రణాళికా అధికారి పీబీ శ్రీనివాసచారి, ట్రెసా జిల్లా కన్వీనర్ అంజయ్య, కో-కన్వీనర్ రమేష్, ఉపగణాంక అధికారులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో మధుసూదన్

వేములవాడ, జనవరి 24: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని వేములవాడ ఆర్డీవో మధుసూదన్ అన్నారు. బుధవారం కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులను ఓటర్లుగా గుర్తించి నమోదు చేసినట్లు చెప్పారు. ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక నమోదులో 1151 మంది వేములవాడ నియోజకవర్గంలో కొత్తగా ఓటరు నమోదు చేసుకున్నారన్నారు. గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. వేములవాడ తహసీల్దార్ మహేశ్ కుమార్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ శ్రవణ్ కుమార్, రాజకీయ పార్టీల నాయకులు పొలాస నరేందర్, నిత్యానందరావు, రాము, జింక ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ గూటికి సర్పంచ్ శ్రీధర్ పంతులు?

సిరిసిల్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా రాజకీయాల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలోని గంభీరావుపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ కటకం శ్రీధర్ పంతులు కాంగ్రెస్ గూటికి చేరనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే కటకం మృత్యుంజయం తనయుడైన శ్రీధర్ గంభీరావుపేట సర్పంచ్‌గా కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందారు. మంత్రిగా కేటీఆర్ ఉన్న సమయంలో సిరిసిల్ల నియోజకవర్గంలో గెలిచి అందరి దృష్టిని తన వైపు తిప్పుకున్నాడు. కటకం మృత్యుంజయంతోపాటు శ్రీధర్ 2020 సంవత్సరంలో అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. శ్రీధర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా కూడా పనిచేశారు. ఆ తరువాత అభివృద్ధి నేపథ్యంలో 2022 జూన్‌లో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మృత్యుంజయం ఇటీవల శాసనసభ ఎన్నికల సమయంలో ఫార్వర్డ్ బ్లాక్‌లో చేరారు. ఆ తర్వాత మళ్లీ మాతృ పార్టీగా ఉన్న కాంగ్రెస్‌లోకి చేరారు. శ్రీధర్ మాత్రం బీఆర్ఎస్‌లోనే కొనసాగారు. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా జాతీయ ఉత్తమ సర్పంచ్‌గా శ్రీధర్ అవార్డు అందుకున్నారు. ప్రభుత్వం మారిన నేపథ్యం, తన రాజకీయ కుటుంబం కాంగ్రెస్ ప్రస్థానమే ఉన్న నేపథ్యంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం. ఈ నెలలోనే కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ఆయన అనుచరులు తెలిపారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



చిన్నారితో ముచ్చటిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

తంగళ్లపల్లి, జనవరి 24: పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులకు, సిబ్బందికి సూచించారు. బుధవారం తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లల హాజరు రిజిస్టర్ తనిఖీ చేసి వారికి అందిస్తున్న పోషకాహారం, కేంద్రంలోని సరుకులపై ఆరా తీశారు. పిల్లల ఆరోగ్య వివరాలు నిత్యం చేయించే కార్యక్రమాల వివరాలను పరిశీలించారు. అనంతరం పిల్లలకు కూరగాయలు, పండ్ల చిత్రాలు చూపించి వాటి పేర్లను అడిగి జవాబులు రాబట్టారు. పలకపై ఏబీసీడీలు రాసి పిల్లలకు చూపించి ప్రశ్నించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే కేంద్రంలో అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. పిల్లల్లో సృజనాత్మకత పెంపొందేలా కార్యక్రమాలు రుపొందించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలోని సౌకర్యాలను పరిశీలించారు. బడిలో సమస్యలపై హెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు.

● వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రుపొందించిన అనీమియా ముక్త్ భారత్ పోస్టర్‌ను బద్దనపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎం హెచ్‌వో సుమన్ మోహన్ రావు, ఐసీడీఎస్, ఆర్‌బీఎస్‌కే అధికారులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్ బండ్ పరిశీలన

సిరిసిల్ల టౌన్, జనవరి 24 : సిరిసిల్ల పట్టణంలోని కొత్త చెరువు మినీ ట్యాంక్ బండ్‌ను బుధవారం అదనపు కలెక్టర్ గౌతమి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి పరిశీలించారు. ఈ నెల 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా మినీట్యాంక్ బండ్‌పై నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాట్లపైన సబంధిత అధికారులతో చర్చించారు. మినీ ట్యాంక్ బండ్‌పై పారిశుధ్యంపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. మినీ ట్యాంక్ బండ్ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎండీ అయాజ్ డీఈఈ ప్రసాద్, టీపీబీవో నవీన్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఉన్నారు.

రెండు గ్రామాల్లో వైద్య శిబిరం

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట, దుమాల గ్రామాల్లో రెడ్ క్రాస్ సొసైటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య నిపుణులు మొత్తం 207 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. గ్రామంలో రెడ్ క్రాస్ సొసైటీ, ఐసీడీఎస్ సంయుక్తంగా వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని సర్పంచులు శంకర్, రజిత అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్లు బాబాయి, సుమలత, మరియా, కవిత, మంజుల, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల ప్రగతిలో సర్పంచులే కీలకం



సన్మానం పొందిన సర్పంచులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: ప్రజలకు సేవ చేసే భాగ్యం అందరికీ రాదని, అందుబాటులో ఉండి చేసిన సేవలు మరవలేనివని జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు అన్నారు. గ్రామల ప్రగతిలో సర్పంచులే కీలకమన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో ఎల్లారెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులకు బుధవారం ఆత్మీయ సత్కారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఐదేళ్ల పాటు గ్రామాభివృద్ధికి చేసిన సేవ చిరస్థాయిగా గుర్తుండిపోతోందన్నారు. ప్రగతి పనులు భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతాయన్నారు.అనంతరం సర్పంచులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రేణుక, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బాస్కర్, ఎంపీడీవో చిరంజీవి, తహసీల్దార్ రాంచందర్, నాయబ్ తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీవో వజీర్‌అహ్మద్, సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ సరఫరా పూర్తి చేయాలి

తంగళ్లపల్లి, జనవరి 24: నిర్దేశిత గడువులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. బుధవారం తంగళ్లపల్లి మండలంలోని రామన్నపల్లె, బస్వాపూర్, తంగళ్లపల్లి లోని రైస్‌మిల్లులను పౌర సరఫరా అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. ఎఫ్‌సీఐకి రైస్ మిల్లర్లు సరఫరా చేయాల్సిన బియ్యం ఈ నెల 31వ తేదీగడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోజువారి లక్ష్యం నిర్దేశించుకోవాలని, బియ్యం సరఫరా చేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

సారంపల్లిలో క్రికెట్ పోటీలు

తంగళ్లపల్లి, జనవరి 24: జడ్పీటీసీ పూర్మాణి మంజుల లింగారెడ్డి ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొయ్యడ రమేశ్, ఉప సర్పంచ్ పర్శరాములు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిగెల రాజు, గుగ్గిళ్ల భరత్ గౌడ్, సుంచుల కిషన్, రాములు, అభిషేక్, నవీన్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జనవరి 24 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ తరఫున కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. బహుజన క్లాస్ టీచర్స్ అసోసియేషన్ వారు రూపొందించిన నూతన సంవత్సర డైరీని బుధవారం క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా ఉంటుందని, ఉపాధ్యాయ సమస్యల పట్ల సానుకూలంగా ఉందని అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వేసవిలో జరిపే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో ఉందని, 317 జీవో ద్వారా నష్టపోయిన ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో విద్యా వలంటీర్లను, అలాగే 15 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా నియమిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మ లక్ష్మణ్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వికృర్తి లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు పులి రామ్ గోపాల్ గౌడ్, జిల్లా సంఘ బాధ్యులు తాటికొండ కృష్ణహరి, ఈగ శ్రీనివాస్, కందుకూరి దేవదాస్, వీరగోని చైతన్య, వనపర్తి మల్లేశం, వంగ పరుశురాం, లక్ష్మీనారాయణ, మండల నోడల్ ఆఫీసర్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



బహుమతులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్లలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బాలికలు మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలు ప్రవేశ పెడుతున్నట్లు చెప్పారు. బాలికలు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ఉన్నత చదువుల ద్వారా లక్ష్యాలను సాధించాలని అన్నారు. విద్యార్థినులను టీచర్లు, కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే ప్రదర్శన ఆకట్టుకున్నాయి. పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జడ్పీటీసీ పూర్మాణి మంజుల, ఎంపీపీలు స్వరూప రాణి, మానస, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా విద్యాధికారి రమేష్, సీడీపీవోలు అలేఖ్య, ఎల్లయ్య, హెచ్ఎం శారద, కౌన్సిలర్ దేవదాసు, కాంగ్రెస్ జిల్లా మాజీ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళా అధ్యక్షురాలు కాముని వనిత, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు, మాజీ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు వెల్మల స్వరూప, గడ్డం నర్సయ్య, మాజీ మండల అధ్యక్షుడు వైద్య శివప్రసాద్ పాల్గొన్నారు.

ప్రారంభమైన జేఈఈ మెయిన్స్ పరీక్షలు

● మొదటి రోజు 422 మందికి 382మంది హాజరు

తిమ్మాపూర్, జనవరి24: దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్(జేఈఈ మెయిన్స్) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలి విడత జేఈఈ మెయిన్స్ పరీక్షలు తిరిగి ఈ నెల 27,29,30,31, ఫిబ్రవరి 1 వరకు జరగనున్నాయి. మొదటి రోజు జిల్లాలో కేవలం మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం ఒకే సెషన్‌లో పేపర్ -2 పరీక్షలు నిర్వహించారు. మిగతా రోజుల్లో రెండు సెషన్‌లలో పేపర్ - 1 పరీక్ష నిర్వహించనున్నారు. పేపర్-2లో భాగంగా బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్షలు జరిగాయి.

ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు రెండు గంటల ముందు నుంచి 12.30గంటల నుంచి విద్యార్థు లను అనుమతించారు. విద్యార్థులు తమవెంట అడ్మిట్ కార్డును, ఫొటో తో కూడిన ధ్రువీకరణ కోసం గుర్తింపు కార్డులను పరిశీలించి అనంత రం లోనికి అనుమతించారు. బుధవారం జరిగిన పరీక్షలకు 422 మం దికి 382మంది విద్యార్థులు హాజరు కాగా 40మంది విద్యార్థులు పరీ క్షకు గైర్హాజరైనట్లు ఎన్‌టీఏ సిటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలి పారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

జమ్మికుంట రూరల్, జనవరి 24: జమ్మికుంట మండలం వెంకటేశ్వర్లపల్లికి చెందిన రామడుగు సంపత్‌రావు ఇంట్లో విద్యుదాఘాతంతో నిత్యావసర వస్తువులు పూర్తిగా దగ్ధం అయ్యాయి. పొలం పనుల నిమిత్తం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లగా కొద్ది గంటల వ్యవధిలోనే ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వస్తున్నాయని స్థానికులు ఫోన్ చేసి చెప్పారు. దీంతో హుటాహుటిన వారు వచ్చేసరికే ఇంట్లోని నిత్యావసర వస్తువులు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొత్తం దగ్ధం అయ్యాయి. షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని, రూ.3లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ కుమార్ కోరారు.

'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నాయి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మాణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుండా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.


హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పోయాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.

420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావోస్‌లో పచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై


బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్లు అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.


మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?


- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన అడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని



గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాముల వారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత అడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను

సత్వరం ఆమోదించండి

తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరపున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును


రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్లు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.

వృద్ధులకు ప్రభుత్వం అండ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం

సిరిసిల్ల టౌన్, జనవరి 24 : ప్రభుత్వం వృద్ధులకు అండగా ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం అన్నారు. బుధవారం సిరిసిల్ల పట్టణ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ జిల్లా స్థాయి క్రీడను మొదటి రోజు జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం, తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమా వేశంలో లక్ష్మీరాజం మాట్లాడుతూ శారీరక, మానసిక ఉల్లాసం కోసం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ క్రీడా పోటీలను నిర్వహించిందన్నారు. వృద్ధులకు ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం పక్షాన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతు బంధు మాజీ జిల్లా అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆడెపు రవీందర్, తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, ఉపాధ్యక్షుడు ఏనుగుల ఎల్లయ్య, కోశాధికారి దొంత దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోనరావుపేట, జనవరి 24: ప్రజల ఆరోగ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాలలో రూ.20 లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాతోపాటు క్రీడా ప్రాంగణం, మహిళా సమాఖ్య భవనాలను జడ్పీ చైర్ పర్సన్ అరుణారాఘవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యవైద్య రంగాలకు పెద్దపీట వేస్తోందన్నారు. ఆరోగ్యశ్రీ ఐదు లక్షల నుంచి పది లక్షలకు పెంచామన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా బస్సు ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నట్లు చెప్పారు. సుద్దాల పల్లె దవాఖానాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సర్పంచ్ ఉప్పుల దేవలక్ష్మి శంకర్, ఎంపీటీసీ మమత మహేష్, ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, కాంగ్రెస్ జిల్లా నాయకుడు కచ్చకాయల ఎల్లయ్య, బాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, ప్రజా ప్రతినిధులు కాకరకాయల మంజుల, అంబోజ లక్ష్మీనారాయణ, ఎర్రబెల్లి విజయ్, నరేష్, మహేష్, నీరటి సంజీవ్, ఉప్పుల గంగయ్య పాల్గొన్నారు.


పల్లె దవాఖానా ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్

గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి

చందుర్తి: గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండలం మూడపల్లి, గోస్కుపల్లి, ఎనగల్ గ్రామాల్లో బుధవారం కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించారు. వేములవాడ ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటిసారి గ్రామానికి వచ్చిన ఆది శ్రీనివాస్‌కు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి గొప్ప విజయాన్ని కట్టబెట్టిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం మొదటగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చిందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీపథకం కింద 10 లక్షల వరకు అమలు చేశామన్నారు. జడ్పీటీసీ నాగం కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామస్వామి, నాయకులు రవిందర్‌రెడ్డి, ఏసుదాసు, మోహన్, లచ్చయ్య, ఎన్గంటి శంకర్, ల్యాండే సత్తయ్య, ప్రభాకర్, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్‌లోని కేజీబీవీలో ఆ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఉపాధ్యాయులతో కలిసి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేందర్‌రావు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని అన్నారు. కేజీబీవీ ప్రత్యేక అధికారి అజంత పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవితా పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి కవితా పోటీల్లో ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గొల్లపల్లి వైశాలి అనే విద్యార్థిని ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచిందని హెచ్ఎం వెంకట్‌రెడ్డి బుధవారం తెలిపారు. సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో వైశాలి కవితా పోటీల్లో సత్తా చాటిందని పేర్కొన్నారు. ఈ నెల 25న హైదారాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా బహుమతి అందుకోనున్నట్లు చెప్పారు. సర్పంచ్ వాణి, ఎంపీటీసీ పద్మ, ఎస్ఎంసీ చైర్మన్ యూసుఫ్ పాల్గొన్నారు.

పత్తి వ్యాన్‌కు తగిలిన విద్యుత్ తీగ .. తప్పిన ప్రమాదం

వేములవాడ టౌన్, జనవరి 24: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ పరిధిలోని రెడ్డికాలనీలో పత్తిలోడుతో వెళ్తున్న వ్యాన్‌కు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు మరింతగా వ్యాపిస్తాయని గమనించి వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో ప్రమాదం తప్పింది. స్వల్పంగా పత్తి కాలినట్లు స్థానికులు తెలిపారు.

అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

గంభీరావుపేట, జనవరి 24 : గంభీరావుపేట మండలం గోరంటాలలో బుధవారం గృహ అసరాల కోసం లో వోల్టేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.2 లక్షల 70వేల అంచనాలలో సింగిల్ ఫేజ్ అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, నర్మాల సర్పంచ్ రాజు, స్థానిక ఎంపీటీసీ అంజిరెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, రాజారాం, శ్రీనివాస్ ఉన్నారు.

నిధులు దుర్వినియోగం కాలేదు

కోనరావుపేట, జనవరి 24 : మండలంలోని కొండాపూర్‌లో రూ.25 లక్షల నిధులు దుర్వినియోగం కాలేదని గ్రామస్థులు పేర్కొన్నారు. బుధవారం కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ తరుపున పలువురు గ్రామపంచాయతీలోని రికార్డులు తనిఖీ చేసేందుకు రాగా నిలదీశారు. గతంలో జీపీ నిధులు రూ. 25 లక్షలను సర్పంచ్ దుర్వినియోగం చేశారని ఆరోపించగా ఉన్నత అధికారులు వాటిని తనిఖీ చేసి నివేదిక ఇచ్చారని తెలిపారు. కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సంస్థ తరుపున వచ్చిన వ్యక్తులు తమకు ఇష్టం వచ్చినట్లు తప్పుడు వివరాలను అధికారులకు అందిస్తున్నారని తెలిపారు.

ప్రభుత్వ సలహాదారుడిని కలిసిన కాంగ్రెస్ నేతలు

గంభీరావుపేట, జనవరి 24: ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీని గంభీరావుపేట మండల కాంగ్రెస్ నేతలు బుధవారం కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో షబ్బీర్‌అలీని కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. షబ్బీర్ అలీని కలిసిన వారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, సింగిల్‌విండో డైరెక్టర్ అంజిరెడ్డి ఉన్నారు.

వంట గది నిర్మాణానికి భూమి పూజ

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: ఎల్లారెడ్డిపేట మండలం బుగ్గరాజేశ్వరతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.3.40 లక్షల ఈజీఎస్ నిధులతో తలపెట్టిన వంట గది నిర్మాణానికి సర్పంచ్ రజిత బుధవారం భూమి పూజ చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎంసీ చైర్మన్ సురేశ్‌నాయక్, బీఆర్ఎస్ జిల్లా యువజన నాయకుడు తిరుపతినాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరికి రెండేళ్లు జైలు, రూ.10 వేల జరిమానా

సిరిసిల్ల క్రైం , జనవరి 24: భూమి అమ్మకంలో మోసం చేసిన ఒకరికి రెండేళ్లు కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ బుధవారం తీర్పును ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. 2010లో సిరిసిల్ల పట్టణానికి చెందిన ఏల్లగొండ రాజేందర్, సామల పోశెట్టి అనే ఇద్దరు పత్తిపాక గోవర్ధన్‌కు చెందిన భూమిని తాము కొన్నామని నమ్మించి సిరిసిల్ల పట్టణానికి చెందిన తడుక సత్యనారాయణ వద్ద రూ.4 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకున్నారు. రూ.100 స్టాంప్ పేపర్‌పై విక్రయ పత్రం రాసి ఇచ్చినారు. మిగతా రూ.2 లక్షలు తీసుకొని రిజిస్ట్రేషన్‌కు అన్ని తయారు చేసుకోవాలని చెప్పారు. భూమి రిజిస్ట్రేషన్ చేయలేదు. రూ.6 లక్షల వారి సొంతానికి వాడుకొని మోసం చేశారని, అడిగితే తిట్టి, కొట్టి చంపుతానని బెదిరించారని బాధితుడు ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై బాలకృష్ణ కేసు నమోదు చేసి విచారణ అనంతరం నిందితులైన ఎల్లగొండ రాజేందర్, సామల పోశెట్టిపై కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ వేముల నరేష్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణ మధ్యలో రాజేందర్ చనిపోయాడు. మరో నిందితు డైన సామల పోశెట్టి ఉండగా ఏపీపీ సందీప్ వాదించారు. న్యాయమూర్తి రెండేళ్ల కఠిన కారాగార జైలు శిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారని సిరిసిల్ల టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామంలో బుధవారం నిర్వహించారు. కేంద్ర పథకాలను వివరించారు. సర్పంచ్ అమృత, ఉప సర్పంచ్ బాలు, వైద్యాధికారి స్రవంతి పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గం

సిరిసిల్ల కలెక్టరేట్, జనవరి 24: జిల్లా నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిరిసిల్ల పట్టణంలోని టీఎన్‌జీవోఎస్ సంఘం భవనంలో జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా సత్తయ్య, పుష్ప, ఎస్.నవీన్, మల్లేశం, కార్యదర్శులుగా జీవన్, రాజు, సహాయ కార్యదర్శులుగా అశోక్, మమత, కోశాధికారిగా వెంకటసత్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సతీష్‌కుమార్, ప్రచార కార్యదర్శిగా ఎండీ యూనస్, కార్యాలయ కార్యదర్శింగా ఎం.లచ్చిరాం, కార్యవర్గ సభ్యులుగా ఎం.రాణి, పి.సమత, యాదగిరి, సాంబయ్య, సయ్యద్ సర్వర్, అంజనేయులు, దేవేందర్, గంగాజల, ఎండీ ఇసాక్, ప్రమోద్, కళ్యాణ్, రమేష్, శంకరయ్య, శశిధర్, అర్షద్‌పాషా ఎన్నికయ్యారు. వీరందరూ బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌ను కలిశారు.

సీపీఐ నాయకుడికి పరామర్శ

సిరిసిల్ల టౌన్, జనవరి 24 : సిరిసిల్ల పట్టణానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు సామల మల్లేశం అనారోగ్యం బారిన పడగా బుధవారం సిరిసిల్ల పట్టణంలోని ఆయన స్వగృహంలో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పరామర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వేణు, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, నాయకులు ఉన్నారు.

వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తాం


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 24 : సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి తెలిపారు. బుధవారం సిరిసిల్ల పట్టణానికి వచ్చిన ఆయనకు లాల్ బహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం, సీపీఐ జిల్లా నాయకులు సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిందని వివరించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని వినతిప్రతం అందజేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబించిన విధానాలతోనే సిరిసిల్లలో వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోయిందని లాల్ బహుట చేనేత పవర్‌లూం కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి పంతం రవి వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేయించుకొని వాటి బకాయిలను చెల్లించక పోవడం కూడా ఒక కారణంమైందని చాడ వెంకటరెడ్డికి తెలిపారు. సిరిసిల్లలో యారన్ బ్యాంక్ ఏర్పాటు చేసి నేరుగా ఆసాములకు యథావిధిగా ఆర్డర్లను ఇస్తూ 50 శాతం విద్యుత్ సబ్సిడీ సమస్యలను తొలగించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలను తీసుకుంటూ ఇతర రాష్ట్రాల నుంచి గుడ్డను కొనుగోలు చేస్తున్న మార్వాడీ యజమానులను పిలిపించి చర్చలు జరపాలన్నారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన వస్త్రాలను కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడితే సమస్యలు కొంతవరకు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, కార్యదర్శి కడారి రాములు, నాయకులు నల్ల చంద్రమౌళి, కొంక విజయ్, అన్నల్‌దాస్ గణేష్ పాల్గొన్నారు.

మొగి పురుగు నివారణపై దృష్టిసారించాలి

వేములవాడ రూరల్, జనవరి 24: వరిపైరులో ప్రస్తుత సీజన్‌లో వచ్చే మొగిపురుగు నివారణపై రైతులు ప్రత్యేక దృష్టిసారించాలని, దాని నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మదన్‌మోహన్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపెల్లిలో జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం వరిపంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో మొగి పురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని గుర్తించి రైతులకు తగు సూచనలు చేశారు వ్యవసాయాధికారి సాయికుమార్, ఏఈవో అనుష పాల్గొన్నారు.

వీధికుక్క దాడిలో 8 మందికి గాయాలు

ఇల్లంతకుంట, జనవరి 24: మండలంలోని పొత్తూర్‌లో వీధి కుక్కదాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం... మంగళవారం సాయంత్రం ఓ వీధికుక్క రోడ్డుపై కనిపించిన వారిని కర్చుకుంటూ వెళ్లింది. కుక్క దాడిలో వడియాల సాన్వితరెడ్డి, గుంటి శ్రీజ, గుంటి వైష్ణవి, గుంటి అయిలవ్వ, శనిగరపు మల్లేశం, వడియాల రాజిరెడ్డి, ఆకుల రాజు, మహేంద్ర గాయపడ్డారు. అప్రమత్తమైన గ్రామస్థులు కుక్కను చంపివేశారు. తీవ్రంగా గాయపడిన చిన్నారి సాన్వితరెడ్డి, గుంటి అయిలవ్వ, రాజిరెడ్డి, మహేంద్రను కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతున్నారు. బాధితులను ఎంపీపీ వుట్కూరి వెంకటరమణారెడ్డి, వైద్యాధికారి శరణ్య పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తామని, ఆందోళన చెందవద్దని ఎంపీపీ సూచించారు. పరామర్శించిన వారిలో నాయకులు ముక్కీస కేశవరెడ్డి, ఆకుల సత్యం ఉన్నారు.

ఘనంగా డ్రైవర్స్ డే


డ్రైవర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న డీఎం

సిరిసిల్ల టౌన్, జనవరి 24 : సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో బుధవారం డ్రైవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. సిరిసిల్ల పాత బస్టాండ్ ప్రాంగణంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్లకు డిపో మేనేజర్ మనోహర్, సిబ్బంది గులాబీ పూలను అందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2023 - 2024 సంవత్సరం ఉత్తమ డ్రైవర్లుగా ఎంపికైన భూక్య మోహన్, మానువాడ ప్రశాంత్‌కుమార్, మాలోతు గణపతిని సిరిసిల్ల ట్రాఫిక్ ఎస్సై రాజు, డిపో మేనేజర్ మనోహర్ సన్మానించారు. అనంతరం ట్రాఫిక్ ఎస్సైని రాజును డిపో మేనేజర్, సిబ్బంది సన్మానించారు. డిపో ఎస్‌టీఐ ఎల్ .సారయ్య, సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ వెంకన్న, టీఐ - 2 జేఆర్ మౌళి, ఏఎంఎఫ్ ఖాన్, సేఫ్టీ వార్డెన్ లకావత్ రాంరెడ్డి నాయక్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ పాపారావు, డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

అదనపు బస్సుల కోసం విద్యార్థుల ధర్నా


ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

సిరిసిల్ల టౌన్, జనవరి 24: అదనపు బస్సులు వేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం సిరిసిల్ల పట్టణం పాత బస్టాండ్‌లో ధర్నా చేపట్టారు. దీంతో పాత బస్టాండ్‌లోకి బస్సుల రాకపోకలకు కొద్ది సేపు అంతరాయం కలిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ సిరిసిల్ల పరిసరాల ప్రాంతాలైన వివిధ గ్రామాల నుంచి ప్రతీరోజు ఉన్నత విద్య కోసం విద్యార్థులు వందల సంఖ్యలో వస్తూ పోతుంటారన్నారు. సిరిసిల్ల, వేములవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు సమయానికి రాకపోవడంతో విద్యార్థులు గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులతో ఇబ్బంది పడు తున్నారని వాపోయారు. సమయానికి కళాశాలలకు, పాఠశాలలకు విద్యార్థులు చేరుకోలేక పోతున్నారని, తిరిగి సాయంత్రం సమయంలో ఇంటికి కూడా త్వరగా చేరుకోలేక పోతున్నారని అన్నారు. విద్యార్థుల పరీక్షల సమయంలో అదనపు బస్సులు వేయాలని బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సిరిసిల్ల డిపో మేనేజర్‌కు పలుమార్లు వినతిపత్రాలని అందజేసిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా డిపో మేనేజర్లు అదనంగా బస్సులు వేసి ఇబ్బందులు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ నాయకులు మట్టి శ్రీనివాస్, నవీన్, నరేష్, జగన్, తిరుపతి పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీపీఐ ఉద్యమాలు

ఇల్లంతకుంట, జనవరి 24: నిరుపేదలకు మద్దతుగా ఉద్యమాలు నిర్మించిన ఘనత సీపీఐదేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. మండలంలోని తాళ్లపెల్లి గ్రామంలో బుధవారం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 98 సంవత్సరాలు గడిచిందన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంలో కమ్యూనిస్టులు క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. అధికారం కోసం ఏనాడూ పాకులాడకుండా ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేశామన్నారు. మూడు లక్షల ఎకరాల భూమిని పంచినట్లు చెప్పారు. ఈ ఉద్యమంలో 4500 మంది కమ్యూనిస్టులు అమరులయ్యారని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలని కోరారు. జిల్లా నాయకులు మంద సుదర్శన్, శోభ, నాగరాజు, బాలరాజు, పోచయ్య, రాజమల్లు, శంకర్, ఆనంద్, గోవింద్, లక్ష్మన్, నర్సయ్య, రామచంద్రం పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో పంట దిగుబడి

రుద్రంగి, జనవరి 24 : విత్తన శుద్ధితో పంట దిగుబడి పెరుగుతుందని ఏఈవో విజయ్ అన్నారు. రుద్రంగి మండలం మానాలలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ క్షేత్రంలో నువ్వుల్లో విత్తన శుద్ధి చేసి పంట వేశారు. కిలో విత్తనాలకు 3గ్రాముల మాంకోజెబ్‌తో విత్తన శుద్ధి చేయాలన్నారు. విద్యార్థులు అఖిల, సింధూజ, అమూల్య సుష్మప్రియాంక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ


గంభీరావుపేట, జనవరి 24 : గంభీరావుపేట మండలం దేశాయిపేటలో తాళాలు వేసిన ఉన్న రెండు ఇళ్లలో దొంగలు పడ్డారు. గ్రామానికి చెందిన పిరంగి దేవలక్ష్మి ఇంట్లో 4 తులాల బంగారం, జక్కుల బాలయ్య ఇంట్లో 4 వేల నగదును దొంగలు ఎత్తుకెళ్లారు. రెండు ఇళ్లలో తాళాలను పగుల గొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు జక్కుల బాలయ్య కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి, నర్మాలలోని బంధువల ఇంటికి వెళ్లారు. దేవలక్ష్మి ఇంటికి తాళం వేసి అదే ఊరిలోని తన అక్క ఇంటికి వెళ్లి నిద్రించింది. ఇళ్లలోకి చొరబడి బీరువాల లాక్‌లను తీసి, బట్టలు చిందర వందర చేశారు. బీరువలోని విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు.

పాఠశాల నిర్వాహకులపై కేసులు సరికాదు


మాట్లాడుతున్న ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

వేములవాడ, జనవరి 24 : పాఠశాలల నిర్వాహకులపై కేసులు నమోదు చేయడం సరికాదని ట్రస్మా జిల్లా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అన్నారు. వేములవాడలోని హంసిని స్కూల్లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. గత నెలలో ఓ విద్యార్థినిని నేలపై కూర్చోబెట్టాడన్న ఫిర్యాదుతో పాఠ శాల నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారని, ఈ ఘటనలో పాఠశాల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించ లేదని పేర్కొన్నారు. పాఠశాలకు సరిగా రాక పోవడం, యూనిఫామ్ ధరించకపోవడం, హోం వర్క్ చేయకపోవడంతో విద్యార్థినికి క్రమశిక్షణ అల వాటు చేసే క్రమంలో చోటుచేసుకున్న ఘటనలపై విద్యార్థిని తండ్రి తప్పుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలతో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 27వ తేదీన శనివారం వేములవాడ పట్టణంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు బంద్ పాటించాలని నిర్ణయించామన్నారు. పట్టణ ప్రైవేట్ పాఠశాల సంఘం అధ్యక్షుడు దేవేందర్, చిరంజీవి, దేవేందర్, ప్రసాద్, శ్రీసన్నిధి వెంకటకృష్ణ, బూర ఉమ, నరాల సంతోష్ పాల్గొన్నారు.

మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టాలి


నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

సిరిసిల్ల రూరల్, జనవరి 24 : మతోన్మాదుల కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూ నగర్‌లో భవాని ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం లెనిన్ శతవర్ధంతి సందర్భంగా కమ్యూనిజం- సమకాలీన పరిస్థితులు అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ లెనిన్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను ఉధృతం చేయాలన్నారు. లెనిన్ స్ఫూర్తితోనే మనదేశంలో భగత్‌సింగ్, నేతాజీ సుభాష్ చంద్రబోష్, నెహ్రూ వంటి వారు ప్రభావితులయ్యారన్నారు. కమ్యూనిజం నాడు, నేడు, రేపు సంజీవంగా ఉంటుందన్నారు. తాత్కాలిక ఎదురు దెబ్బలు తగిలిన కమ్యూనిజం ఒక సామాజిక సిద్ధాంతామని, అది ఎప్పటికీ ముందుకు సాగుతుందని అన్నారు. సామ్రాజ్యావాదం, మతోన్మాదం పెట్టుబడిదారి విధానానికి వ్యతరేకంగా ఉద్యమాలకు ప్రజలు సిద్ధంకావాలని పిలుపు నిచ్చారు. దేశంలో మతోన్మాద బీజేపీ ప్రజల మధ్య చిలికలు పెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తోందన్నారు.

బీఆర్ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

కోనరావుపేట, జనవరి 24 : బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి పథంలో నడిచాయని జడ్పీ చైర్ పర్సన్ అరుణా రాఘవరెడ్డి అన్నారు. కోనరావుపేట మండలం రామన్నపేటలో బుధవారం తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సర్పంచ్ సంతోష్, ఎంపీటీసీ మల్లేశం పాల్గొన్నారు.

సర్పంచ్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

కోనరావుపేట, జనవరి 24: కోనరావుపేట మండలం మర్తన్‌పేట సర్పంచ్ వంశీరావుపై అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతి గౌడ్, తహసీల్దార్ విజయ రామారావుకు బుధవారం ఫిర్యాదు చేశారు. తిరుపతి గౌడ్ మాట్లాడుతూ మర్తన్నపేట సర్పంచ్‌గా కొనసాగుతున్న వంశీ రావు రేషన్ డీలర్‌గా కమిషన్ తీసుకుంటున్నాడని ఆరోపించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: వారంరోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండలం గుండారం పంచాయతీ పరిధిలోని పోచమ్మతండాకు చెందిన బానోతు నాజం(45) బుధవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. గ్రామంలోని నాజం తన కున్న భూమిలో వ్యవసాయం చేస్తూ జీవిస్తుండేవాడు. దిగుబడులు లేక కుటుంబ పోషణ భారంగా మారింది. ఈ క్రమంలో నాజం పదేళ్ల దుబాయి వెళ్లాడు. ఏడాది కిందట స్వగ్రామానికి వచ్చిన ఆయన తిరిగి పయనమయ్యాడు. పది రోజుల క్రితం స్వగ్రామానికి చేరుకున్నాడు. తన కుటుంబ సభ్యులతో గత కొంత కాలంగా భూ సమస్య కొనసాగుతోంది. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. సమస్య పరిష్కారం కాకపోవడం వల్ల మనస్థాపానికి గురైన నాజం వారం రోజుల కిందట ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చివరికీ మృతి చెందాడు. మృతిపై కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ప్రజల కోసమే పోలీసులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24: ప్రజల కోసమే పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారని ఎస్ఐ రమాకాంత్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లో బుధవారం రాత్రి పోలీస్ కమ్యూనిటీ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో గొడవలు చోటు చేసుకోకుండా ప్రజలు శాంతియుతంగా ఉండాలన్నారు. ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు పాల్గొన్నారు.

ఈత చెట్టు పైనుంచి పడి గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 24:ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు పుల్లక్ దేవయ్య ప్రమాదవశాత్తు ఈత చెట్టు పై నుంచి బుధవారం కింద పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దేవయ్య రోజులాగే కల్లు తీసేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. కల్లు తీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. విషయం తెలుసుకున్న గీత కార్మికులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

తప్పిపోయిన చిన్నారి అప్పగింత

ముస్తాబాద్, జనవరి 24 : ముస్తాబాద్ పట్టణానికి చెందిన మూడేళ్ల చిన్నారి బుధవారం తప్పిపోగా పోలీసులు తల్లి వద్దకు చేర్చారు. మండల కేంద్రానికి చెందిన డొక్క స్వప్న కూతురు డొక్క నందిని ఇంటి నుంచి ఆడుకుంటూ బాస్టాండ్ ఏరియాకు వచ్చింది. దారి తెలియక దిక్కు తోచని స్థితిలో ఏడుస్తూ కనిపించిన చిన్నారిని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఏఎస్సై వెంకటరమణ. పీసీలు బాలశ్రీను, కుమార్ అక్కడికి చేరుకొని చిన్నారి తల్లిదండ్రుల సమాచారం గురించి ఆరా తీయగా తెలుసుకొని వారికి అప్పగించారు. ఎస్సై శేఖర్‌రెడ్డి, పీసీలను అభినందించారు.

బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై

ఇల్లంతకుంట, జనవరి 24: బాలికల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఎస్సై దాస సుధాకర్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బాలికలు ఉన్నత చదువులు అభ్యసించాలని, లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. బాలికలు వివక్షతకు గురైతే హెల్ప్‌లైన్ నంబరుకు ఫోన్‌చేయాలని సూచించారు. లైఫ్‌స్కిల్స్, హెల్త్ అండ్ హైజిన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ప్రేమలత, మహేష్‌చంద్ర, మంజుల, స్వప్న, రహీమున్నీసా, ఒగ్గు విజయలక్ష్మి, అరుణ, బాబాయి పాల్గొన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ విద్య బాలికల దిరోత్సవాన్ని నిర్వహించారు. విద్యా బాలికల దినోత్సవం సందర్భంగా టీచర్లతో పిల్లలు మొక్కులు నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచరు, ఆయాలు విద్యార్థులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని నామాపూర్ గ్రామంలో బాలిక దినోత్సావాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో హెచ్ఎం ఎస్ సుధాకర్ ఆధ్వర్యంలో బాలిక బాలిక దోనోత్సవాన్ని నిర్వహించారు. బాలికల సంరక్షణ పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వారి హక్కులను తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఘటనలు చూసి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పాఠశాల సిబ్బంది భాగ్యలక్ష్మీ, లలిత, హన్మంతరెడ్డి, పీసీలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: ఆడపిల్లలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని హెచ్ఎం అనురాధ అన్నారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థినీలకు, తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చందుర్తి: ఆడపిల్లలు ఉన్నత విద్యను పొందితేనే హక్కులు సమానత్వం సాధ్యమని కేజీబీవీ ప్రత్యేక అధికారిని కల్పన అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని కేజీబీవీ, మర్రిగడ్డ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో షీ టీం సభ్యుల ఆధ్వర్యంలో వేర్వే రుగా జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. షీ టీమ్ సిబ్బంది రమాదేవి, శంకర్, శ్రీనివాస్, ఏఎన్ఎం రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు భూజ్యోతి, ప్రధానో పాధ్యాయుడు వినయ్‌కుమార్, విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.